15-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - సర్వులను ఆశీర్వదించే దయార్ద్ర హృదయుడు ఒక్క తండ్రియే, తండ్రినే దుఃఖహర్త, సుఖకర్త అని అంటారు, వారు తప్ప ఇంకెవ్వరూ దుఃఖాన్ని హరించలేరు"

ప్రశ్న:- భక్తి మార్గములోనూ మరియు జ్ఞాన మార్గములోనూ, రెండింటిలోనూ దత్తత తీసుకునే ఆచారము ఉంది కానీ తేడా ఏమిటి?

జవాబు:- భక్తి మార్గములో ఎవరి వద్దనైనా దత్తత తీసుకోబడినప్పుడు గురువు మరియు శిష్యుని సంబంధము ఉంటుంది, సన్యాసులు కూడా దత్తత తీసుకోబడినప్పుడు స్వయాన్ని అనుచరులుగా పిలుచుకుంటారు. కానీ జ్ఞాన మార్గములో మీరు అనుచరులు లేక శిష్యులు కాదు. మీరు తండ్రికి పిల్లలుగా అయ్యారు. పిల్లలుగా అవ్వడము అనగా వారసత్వానికి అధికారులుగా అవ్వడము.

పాట:- ఓం నమః శివాయ...

ఓం శాంతి. పిల్లలు పాటను విన్నారు. ఇది పరమపిత పరమాత్ముడైన శివుని మహిమ. శివాయ నమః అని కూడా అంటారు. రుద్రాయ నమః లేక సోమనాథాయ నమః అని అనరు. శివాయ నమః అని అంటారు, అలాగే మహిమ కూడా అత్యధికంగా వారికే జరుగుతుంది. ఇప్పుడు శివాయ నమః అని అనేది తండ్రినే. గాడ్ ఫాదర్ పేరు శివ. వారు నిరాకారుడు. ఓ గాడ్ ఫాదర్ అని ఎవరు అన్నారు? ఆత్మ. కేవలం 'ఓ ఫాదర్' అని అంటే అది దైహిక తండ్రికి వర్తిస్తుంది. 'ఓ గాడ్ ఫాదర్' అని అంటే అది ఆత్మిక తండ్రికి వర్తిస్తుంది. ఇవి అర్థం చేసుకోవాల్సిన విషయాలు. దేవతలను పారసబుద్ధి కలవారని అంటారు. దేవతలైతే విశ్వానికి యజమానులుగా ఉండేవారు. ఇప్పుడు యజమాని ఎవరూ లేరు. భారత్ కు నాథుడు అంటూ ఎవరూ లేరు. రాజును కూడా తండ్రి, అన్నదాత అని అంటారు. ఇప్పుడైతే రాజులు లేరు. మరి ఇలా శివాయ నమః అని ఎవరన్నారు? వీరు తండ్రి అని ఎలా తెలుస్తుంది? బ్రహ్మాకుమార-కుమారీలైతే ఎంతోమంది ఉన్నారు. వీరంతా శివబాబాకు మనుమలు-మనుమరాళ్ళు. బ్రహ్మా ద్వారా వీరిని దత్తత తీసుకుంటారు. మేము బ్రహ్మాకుమార-కుమారీలమని అందరూ అంటారు. అచ్ఛా, బ్రహ్మా ఎవరి సంతానము? శివుని సంతానము. బ్రహ్మా, విష్ణు, శంకరులు - ముగ్గురూ శివుని సంతానమే. శివబాబా ఉన్నతోన్నతమైన భగవంతుడు, నిరాకారీ వతనములో నివసిస్తారు. బ్రహ్మా, విష్ణు, శంకరులు సూక్ష్మవతనవాసులు. అచ్ఛా, మనుష్య సృష్టిని ఎలా రచించారు? వారు అంటారు - డ్రామానుసారంగా నేను బ్రహ్మా యొక్క సాధారణ తనువులోకి ప్రవేశించి వీరిని ప్రజాపితగా చేస్తాను. నేను వీరిలోకే ప్రవేశించాలి, వీరికి బ్రహ్మా అన్న పేరు పెట్టడం జరిగింది. దత్తత తీసుకున్న తర్వాత పేరు మారిపోతుంది. సన్యాసులు కూడా పేర్లు మార్చుకుంటారు. మొదట గృహస్థుల వద్ద జన్మ తీసుకుంటారు, ఆ తర్వాత సంస్కారాల అనుసారంగా బాల్యములోనే శాస్త్రాలు మొదలైనవి చదువుతారు, ఆ తర్వాత వైరాగ్యము వస్తుంది, అప్పుడు సన్యాసుల వద్దకు దత్తతగా వెళ్తారు, వీరు నా గురువు అని అంటారు. ఆ గురువును తండ్రి అని అనరు. గురువుకు శిష్యులుగా లేక అనుచరులుగా అవుతారు. నీవు నా శిష్యుడివి లేక అనుచరుడివి అని అంటూ గురువు శిష్యుడిని దత్తత తీసుకుంటారు. ఇక్కడ తండ్రి అంటారు - మీరు నా పిల్లలు. ఆత్మలైన మీరు తండ్రిని భక్తి మార్గములో పిలుస్తూ వచ్చారు ఎందుకంటే ఇక్కడ దుఃఖము ఎంతగానో ఉంది, ఆర్తనాదాలు జరుగుతున్నాయి. పతిత-పావనుడైన తండ్రి అయితే ఒక్కరే. నిరాకారుడైన శివునికి ఆత్మ నమస్కరిస్తుంది. వారైతే తండ్రే. 'నీవే తల్లివి-తండ్రివి' - అని కూడా గాడ్ ఫాదర్ గురించే గానం చేస్తారు. తండ్రి ఉన్నారంటే మరి తల్లి కూడా తప్పకుండా కావాలి. తల్లి-తండ్రి లేకుండా రచన ఉండదు. తండ్రి పిల్లల వద్దకు రావాల్సిందే. ఈ సృష్టి చక్రము ఎలా రిపీట్ అవుతుంది - దీని ఆదిమధ్యాంతాలను తెలుసుకోవడాన్నే త్రికాలదర్శులుగా అవ్వడమని అంటారు. ఎన్ని కోట్లాది మంది పాత్రధారులు ఉన్నారు, ప్రతి ఒక్కరి పాత్ర ఎవరిది వారిదే. ఇది అనంతమైన డ్రామా. తండ్రి అంటారు - నేను రచయితను, డైరెక్టరును, ముఖ్యమైన పాత్రధారిని, నేను పాత్రను అభినయిస్తున్నాను కదా. నా ఆత్మను సుప్రీమ్ అని అంటారు. ఆత్మ మరియు పరమాత్మ యొక్క రూపము ఒక్కటే. వాస్తవానికి ఆత్మ బిందువు. భృకుటి మధ్యలో ఆత్మా నక్షత్రము ఉంటుంది కదా. అది చాలా సూక్ష్మమైనది, దానిని చూడలేరు. ఆత్మ కూడా సూక్ష్మమైనదే, అలాగే ఆత్మ యొక్క తండ్రి కూడా సూక్ష్మమైనవారే. తండ్రి అర్థం చేయిస్తారు - ఆత్మ అయిన మీరు బిందు సమానముగా ఉంటారు, శివుడినైన నేను కూడా బిందు సమానముగానే ఉంటాను. కానీ నేను ఉన్నతోన్నతమైనవాడిని, రచయితను, డైరెక్టరును, జ్ఞానసాగరుడను. నాలో సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానముంది. నేను జ్ఞానసాగరుడను, దయాసాగరుడను, అందరినీ ఆశీర్వదిస్తాను. అందరినీ

సద్గతిలోకి తీసుకువెళ్తాను. దుఃఖహర్త, సుఖకర్త ఒక్క తండ్రియే. సత్యయుగంలో దుఃఖితులు ఎవరూ ఉండరు. లక్ష్మీ-నారాయణుల రాజ్యమే ఉంటుంది.

తండ్రి అర్థం చేయిస్తారు - నేను ఈ సృష్టి రూపీ వృక్షానికి బీజరూపుడను. మామిడి వృక్షము ఉందనుకోండి, అది జడమైన బీజము, అది మాట్లాడదు. ఒకవేళ చైతన్యమైనది అయినట్లయితే - బీజమైన నా నుండి ఈ విధంగా కొమ్మలు-రెమ్మలు, ఆకులు మొదలైనవి వెలువడతాయని చెప్తుంది. ఇప్పుడు ఇది చైతన్యమైనది, దీనిని కల్పవృక్షమని అంటారు. మనుష్య సృష్టి రూపీ వృక్షానికి బీజము పరమపిత పరమాత్మ. తండ్రి అంటారు - నేనే వచ్చి దీనికి సంబంధించిన జ్ఞానాన్ని అర్థం చేయిస్తాను, పిల్లలను సదా సుఖవంతులుగా చేస్తాను. దుఃఖితులుగా చేసేది మాయ. భక్తి మార్గము పూర్తవ్వనున్నది. డ్రామా తప్పకుండా రిపీట్ అవ్వనున్నది. ఇది అనంతమైన ప్రపంచము యొక్క చరిత్ర, భౌగోళము. చక్రము తిరుగుతూ ఉంటుంది. కలియుగము మారి మళ్ళీ సత్యయుగముగా అవ్వనున్నది. సృష్టి అయితే ఒక్కటే, గాడ్ ఫాదర్ ఒక్కరే, వారికి ఫాదర్ అంటూ ఎవ్వరూ లేరు. వారే శిక్షకుడు కూడా, చదివిస్తున్నారు. భగవానువాచ - నేను మీకు రాజయోగాన్ని నేర్పిస్తాను. మనుష్యులకు తల్లి-తండ్రి గురించి తెలియదు. పిల్లలైన మీకు తెలుసు - నిరాకారుడైన శివబాబాకు మనం నిరాకారీ పిల్లలము. అలాగే సాకార బ్రహ్మకు కూడా పిల్లలము. నిరాకారుని పిల్లలందరూ పరస్పరం సోదరులు మరియు బ్రహ్మ పిల్లలు సోదరీ-సోదరులు. ఇది పవిత్రంగా ఉండేందుకు యుక్తి. సోదరీ-సోదరులు వికారాలలోకి ఎలా వెళ్తారు. వికారాల అగ్నియే అంటుకుంటుంది కదా. కామాగ్ని అని అంటారు, దాని నుండి రక్షించుకునేందుకు యుక్తిని తండ్రి తెలియజేస్తారు. ఒకటేమో, ప్రాప్తి చాలా ఉన్నతమైనది. ఒకవేళ మనం తండ్రి శ్రీమతంపై నడుచుకున్నట్లయితే అనంతమైన తండ్రి యొక్క వారసత్వాన్ని పొందుతాము. స్మృతి ద్వారానే సదా ఆరోగ్యవంతులుగా అవుతారు. ప్రాచీన భారత్ యొక్క యోగము ప్రసిద్ధమైనది. తండ్రి అంటారు - నన్ను స్మృతి చేస్తూ-చేస్తూ మీరు పవిత్రంగా అవుతారు, పాపాలు భస్మమవుతాయి. తండ్రి స్మృతిలో శరీరాన్ని వదిలినట్లయితే నా వద్దకు వచ్చేస్తారు. ఈ పాత ప్రపంచము అంతమవ్వనున్నది. ఇది ఆ మహాభారత యుద్ధమే. ఎవరైతే తండ్రికి చెందినవారిగా అయ్యారో, వారి విజయమే జరగనున్నది. ఇక్కడ రాజధాని స్థాపనవుతుంది. స్వర్గానికి అధిపతులుగా చేయడానికి భగవంతుడు రాజయోగాన్ని నేర్పిస్తారు. మళ్ళీ మాయా రావణుడు నరకానికి అధిపతులుగా చేస్తాడు. అది శాపము లభించినట్లవుతుంది.

తండ్రి అంటారు - ప్రియమైన పిల్లలూ, నా మతమనుసారంగా మీరు స్వర్గవాసీ భవ. మళ్ళీ రావణ రాజ్యము ప్రారంభమైనప్పుడు రావణుడు - ఓ ఈశ్వరుని పిల్లలూ, నరకవాసీ భవ అని అంటాడు. నరకము తర్వాత మళ్ళీ స్వర్గము తప్పకుండా వస్తుంది. ఇది నరకము కదా. ఎంతగా కొట్లాటలు జరుగుతున్నాయి. సత్యయుగంలో గొడవలు-కొట్లాటలు ఉండవు. భారత్ యే స్వర్గముగా ఉండేది, ఇంకే రాజ్యమూ ఉండేదే కాదు. ఇప్పుడు భారత్ నరకముగా ఉంది, అనేక ధర్మాలు ఉన్నాయి. అనేక ధర్మాల వినాశనాన్ని, ఏక ధర్మ స్థాపనను చేయడానికి నేను రావాల్సి ఉంటుంది అని అంటూ ఉంటారు. నేను ఒక్కసారే అవతరిస్తాను. తండ్రి పతిత ప్రపంచములోకే రావాల్సి ఉంది. పాత ప్రపంచము అంతమవ్వనున్నప్పుడే వారు వస్తారు. దాని కొరకు యుద్ధము కూడా కావాలి.

తండ్రి అంటారు - మధురమైన పిల్లలూ, మీరు అశరీరిగా వచ్చారు, 84 జన్మల పాత్రను పూర్తి చేసారు, ఇప్పుడిక తిరిగి వెళ్ళాలి. నేను మిమ్మల్ని పతితుల నుండి పావనులుగా తయారుచేసి తిరిగి తీసుకువెళ్తాను. లెక్క అయితే ఉంది కదా. 5000 సంవత్సరాలలో దేవతలు 84 జన్మలు తీసుకుంటారు. అందరూ 84 జన్మలు తీసుకోరు. ఇప్పుడు తండ్రి అంటారు - నన్ను స్మృతి చేయండి మరియు వారసత్వాన్ని తీసుకోండి. సృష్టి చక్రము బుద్ధిలో తిరగాలి. మనము పాత్రధారులము కదా. పాత్రధారులు అయ్యుండి డ్రామా యొక్క రచయిత, డైరెక్టరు, ముఖ్యమైన పాత్రధారి గురించి తెలియకపోతే వారు వివేకహీనులు. దీని వలన భారత్ ఎంత నిరుపేదగా అయిపోయింది. మళ్ళీ తండ్రి వచ్చి సుసంపన్నులుగా చేస్తారు. తండ్రి అర్థం చేయిస్తారు - భారతవాసులైన మీరు స్వర్గములో ఉండేవారు, తర్వాత మీరు 84 జన్మలను తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు మీ 84 జన్మలు పూర్తయ్యాయి, ఈ చివరి జన్మ మిగిలి ఉంది. భగవానువాచ, భగవంతుడైతే అందరికీ ఒక్కరే. కృష్ణుడిని మిగిలిన ధర్మాల వారు భగవంతునిగా అంగీకరించరు, నిరాకారుడినే అంగీకరిస్తారు. వారు ఆత్మలందరికీ తండ్రి. వారు అంటారు, నేను అనేక జన్మల అంతిమములో వచ్చి వీరిలో ప్రవేశిస్తాను. రాజధాని స్థాపనవుతుంది, తర్వాత వినాశనము ప్రారంభమవుతుంది, ఆ తర్వాత నేను వెళ్ళిపోతాను. ఇది చాలా గొప్ప యజ్ఞము, మిగిలిన యజ్ఞాలు మొదలైనవేవైతే ఉన్నాయో అవన్నీ ఇందులో స్వాహా అవ్వనున్నాయి. మొత్తం ప్రపంచము యొక్క చెత్త ఇందులో పడుతుంది, ఆ తర్వాత ఇంకే యజ్ఞాలు రచింపబడవు.

భక్తి మార్గము సమాప్తమైపోతుంది. సత్య-త్రేతా యుగాల తర్వాత మళ్ళీ భక్తి ప్రారంభమవుతుంది. ఇప్పుడు భక్తి పూర్తవుతుంది. ఈ మహిమంతా శివబాబాదే. వీరికి ఎన్నో పేర్లు పెట్టారు కానీ ఏమీ తెలియదు. వీరు శివుడు, వీరినే రుద్రుడు, సోమనాథుడు, బాబురీనాథుడు అని కూడా అంటారు. ఒక్కరికే ఎన్నో పేర్లు పెట్టారు. ఎటువంటి సేవ చేసారో అటువంటి పేర్లు పెట్టారు. మీకు సోమరసాన్ని తాగిస్తున్నారు. మాతలైన మీరు స్వర్గ ద్వారాలను తెరిచేందుకు నిమిత్తులయ్యారు. పవిత్రులకే నమస్కరించడం జరుగుతుంది. అపవిత్రులు, పవిత్రులకు నమస్కరిస్తారు. కన్యకు అందరూ తల వంచి నమస్కరిస్తారు. ఈ బ్రహ్మాకుమార-కుమారీలు ఈ భారత్ ను ఉద్ధరిస్తున్నారు. పవిత్రంగా అయ్యి తండ్రి నుండి పవిత్ర ప్రపంచపు వారసత్వాన్ని తీసుకోవాలి. గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రంగా అవ్వాలి, ఇందులో శ్రమ ఉంది. కామము మహాశత్రువు. కామము లేకుండా ఉండలేకపోతే ఇక కొట్టడం మొదలుపెడతారు. రుద్ర యజ్ఞములో అబలలపై అత్యాచారాలు జరుగుతాయి. దెబ్బలు కొడుతూ-కొడుతూ చివరికి వారి పాపభాండము నిండుతుంది, అప్పుడు ఇక వినాశనం జరుగుతుంది. చాలామంది కుమార్తెలు ఉన్నారు, వారు ఎప్పుడూ బాబాను చూడలేదు, అయినా కానీ ఇలా రాస్తారు - బాబా మాకు మీరు తెలుసు, మీ నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు పవిత్రంగా తప్పకుండా అవుతాము అని. తండ్రి అర్థం చేయిస్తారు - శాస్త్రాలు చదవడం, తీర్థ యాత్రలు మొదలైనవి చేయడం, ఇలాంటి భక్తి మార్గపు దైహికమైన యాత్రలనైతే చేస్తూనే వచ్చారు, ఇప్పుడు మీరు తిరిగి వెళ్ళాలి, అందుకే నాతో యోగాన్ని జోడించండి. ఇతర సాంగత్యాలను తెంచి ఒక్క నాతోనే జోడించినట్లయితే మిమ్మల్ని నాతోపాటు తీసుకువెళ్తాను, తర్వాత స్వర్గములోకి పంపిస్తాను. అది శాంతిధామము. అక్కడ ఆత్మలు ఏమీ మాట్లాడవు. సత్యయుగము సుఖధామము, ఇది దుఃఖధామము. ఇప్పుడు ఈ దుఃఖధామములో ఉంటూ శాంతిధామాన్ని, సుఖధామాన్ని స్మృతి చేయాలి, అప్పుడు మీరు స్వర్గములోకి వచ్చేస్తారు. మీరు 84 జన్మలు తీసుకున్నారు, వర్ణాలలో తిరుగుతూ ఉంటారు. మొదటిది బ్రాహ్మణుల పిలక, ఆ తర్వాత దేవతా వర్ణము, క్షత్రియ వర్ణము... పిల్లి మొగ్గలాట ఆడతారు కదా. ఇప్పుడు మనం మళ్ళీ బ్రాహ్మణుల నుండి దేవతలుగా అవుతాము. ఈ చక్రము తిరుగుతూ ఉంటుంది, దీనిని తెలుసుకోవడం ద్వారా చక్రవర్తీ రాజులుగా అవుతారు. అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వము కావాలి. కావున తప్పకుండా తండ్రి మతముపై నడవాల్సి ఉంటుంది. నిరాకారుడైన పరమాత్మ వచ్చి ఈ సాకార శరీరములోకి ప్రవేశించారని మీరు అర్థం చేయిస్తారు. ఆత్మలమైన మనం నిరాకారిగా ఉన్నప్పుడు అక్కడ ఉంటాము. ఈ సూర్య-చంద్రులు దీపాలు వంటివి. దీనిని అనంతమైన పగలు మరియు రాత్రి అని అంటారు. సత్య-త్రేతాయుగాలు పగలు, ద్వాపర-కలియుగాలు రాత్రి. తండ్రి వచ్చి సద్గతి మార్గాన్ని తెలియజేస్తారు. ఎంత మంచి వివరణ లభిస్తుంది. సత్యయుగములో సుఖము ఉంటుంది, ఆ తర్వాత కొద్ది-కొద్దిగా తగ్గిపోతూ ఉంటుంది. సత్యయుగంలో 16 కళలు ఉంటాయి, త్రేతాలో 14 కళలు ఉంటాయి... ఇవి అర్థం చేసుకోవాల్సిన విషయాలు. అక్కడ ఎప్పుడూ అకాల మరణాలు సంభవించవు. ఏడ్వడము, కొట్లాడడము-గొడవపడటము అన్న విషయమే ఉండదు, అంతా చదువుపై ఆధారపడి ఉంటుంది. చదువు ద్వారానే మనుష్యుల నుండి దేవతలుగా అవ్వాలి. భగవాన్-భగవతీగా తయారుచేయడానికి భగవంతుడు చదివిస్తారు. అదైతే పైస అంత విలువచేసే చదువు. ఈ చదువు వజ్రతుల్యమైనది. కేవలం ఈ అంతిమ జన్మలో పవిత్రంగా అవ్వాల్సి ఉంటుంది. ఇది సహజాతి సహజమైన రాజయోగము. బ్యారిస్టర్ మొదలైనవి చదవడము అనేది అంత సహజమేమీ కాదు. ఇక్కడైతే తండ్రిని మరియు చక్రాన్ని స్మృతి చేయడం ద్వారా చక్రవర్తీ రాజులుగా అవుతారు. తండ్రిని తెలుసుకోలేదంటే ఏమీ తెలుసుకోనట్లే. తండ్రి స్వయం విశ్వానికి యజమానిగా అవ్వరు, పిల్లలను ఆ విధంగా తయారుచేస్తారు. శివబాబా అంటారు - వీరు (బ్రహ్మా) మహారాజుగా అవుతారు, నేను అవ్వను. నేను నిర్వాణధామములో కూర్చుండిపోతాను, పిల్లలను విశ్వాధిపతులుగా తయారుచేస్తాను. సత్యాతి-సత్యమైన నిష్కామ సేవను నిరాకారుడైన పరమపిత పరమాత్మయే చేయగలరు, మనుష్యులు చేయలేరు. ఈశ్వరుడిని పొందడం ద్వారా మొత్తం విశ్వానికి యజమానులుగా అవుతారు. భూమి, ఆకాశము అన్నింటికీ యజమానులుగా అవుతారు. దేవతలు విశ్వానికి యజమానులుగా ఉండేవారు కదా. ఇప్పుడైతే ఎన్ని విభజనలు జరిగాయి. ఇప్పుడు మళ్ళీ తండ్రి అంటారు - నేను మిమ్మల్ని విశ్వానికి యజమానులుగా తయారుచేస్తాను. స్వర్గములో మీరే ఉండేవారు. భారత్ విశ్వానికి యజమానిగా ఉండేది, ఇప్పుడు నిరుపేదగా ఉంది. మళ్ళీ ఈ మాతల ద్వారా భారత్ ను విశ్వానికి యజమానిగా తయారుచేస్తాను. మెజారిటీ మాతలదే ఉంది, అందుకే వందే మాతరం అని అంటారు.

సమయం కొద్దిగానే ఉంది, శరీరంపై నమ్మకం లేదు. అందరూ మరణించాల్సిందే. ఇది అందరి వానప్రస్థ అవస్థ, అందరూ తిరిగి వెళ్ళాలి. ఇది భగవంతుడు చదివిస్తున్నారు. నాలెడ్జ్ ఫుల్, పీస్ ఫుల్, బ్లిస్ ఫుల్ అని వారినే అంటారు. వారే మళ్ళీ ఈ విధంగా సర్వగుణ సంపన్నులుగా, 16 కళల సంపూర్ణులుగా, పవిత్రంగా తయారుచేస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల నంబరువారు పురుషార్థం అనుసారంగా ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈ చదువు వజ్రతుల్యంగా తయారుచేస్తుంది, అందుకే దీనిని మంచి రీతిలో చదువుకోవాలి, ఇతర సాంగత్యాలన్నింటినీ వదిలి ఒక్క తండ్రితో సాంగత్యాన్ని జోడించాలి.

2. శ్రీమతంపై నడుస్తూ స్వర్గము యొక్క పూర్తి వారసత్వాన్ని తీసుకోవాలి. నడుస్తూ-తిరుగుతూ స్వదర్శన చక్రాన్ని తిప్పుతూ ఉండాలి.

వరదానము:- నాది అన్న దానిని వదిలి ట్రస్టీగా అయి సేవ చేసే సదా సంతుష్ట ఆత్మ భవ

లౌకిక పరివారములో ఉంటూ, సేవ చేస్తూ సదా గుర్తుండాలి - నేను ట్రస్టీను, సేవాధారిని. సేవ చేస్తూ కొద్దిగా కూడా 'నాది' అనేది ఉండకూడదు, అప్పుడు సంతుష్టంగా ఉంటారు. ఎప్పుడైతే 'నాది' అనేది వస్తుందో, అప్పుడు విసిగిపోతారు, నా కొడుకు ఇలా చేస్తున్నాడు... అని ఆలోచిస్తారు. కావున ఎక్కడైతే 'నాది' అనేది ఉంటుందో, అక్కడ విసిగిపోతారు మరియు ఎక్కడైతే 'నీది-నీది' అనేది వస్తుందో, అక్కడ ఈదటం మొదలుపెడతారు. 'నీది-నీది' అనటం అంటే స్వమానములో ఉండటము, 'నాది-నాది' అనటం అంటే అభిమానములోకి రావటము.

స్లోగన్:- బుద్ధిలో నిత్యం తండ్రి మరియు శ్రీమతము యొక్క స్మృతి ఉండాలి, అప్పుడు హృదయపూర్వకంగా సమర్పితమైన ఆత్మ అని అంటారు.